వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు


విలేకరులతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ నాయకులు తరచూ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ వలీబాష, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వంటీర్లను చూస్తేనే ప్రజలంతా సొంత మనుషుల్లా భావిస్తున్నారన్నారు. వలంటీర్ల పేరు వింటేనే టీడీపీ అధినేత చంద్రబాబు సహా, పార్టీ నాయకుల గుండెల్లో వణుకు పుట్టుకొస్తోందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ చేసిన అనుచిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ రద్దుచేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించాలరా..? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే కొద్దిగొప్పో గౌరవ వేతనంతోనే వలంటీర్లు సరిపెట్టుకుంటూ స్వచ్ఛందంగా పనిచేస్తున్నారన్నారు.

బీటీపీకి నీరు విడుదల జగన్‌తోనే సాధ్యం..

హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణా జలాలను బీటీపీకి చేర్చడం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. చంద్రబాబు, కాలవ శ్రీనివాసుల్లాగా తమకు అపద్ధాలు చెప్పి తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు.ఎన్నికలప్పుడు మాత్రమే ప్రాజెక్టుల పేరెత్తి, ఆ తర్వాత ఊసెత్తకుండా వదిలేసే నైజం టీడీపీ నాయకులదన్నారు. 2014లో భూనిర్వాసితులకు పైసా విదల్చకుండా అక్కడక్కడ డీకేటీ భూముల్లో మాత్రమే తవ్వకాలు జరిపి వదిలేస్తే, సీఎం జగన్ ఆ పని పూర్తి చేసే బాధ్యత తీసుకున్నారన్నారు. ఇటీవల రూ.208 కోట్లు భూనిర్వాసితులకు మంజూరు చేస్తే, అందులో రూ.90 కోట్లు మొదటి విడతగా రైతు ఖాతాలకు జమ చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. బీటీపీకి నీరిచ్చాక దశల వారీగా రాయదుర్గం ప్రాంతంలో చెరువులు, ఉంతకల్లు రిజర్వాయర్ నింపేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొంతెం దేవరాజు, తట్టే మంజు, శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకుడు పొరాళ్ల శివ, హెచ్.రామాంజనేయులు, నిజామ్ పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తూ గౌరవవేతనంతో పని చేస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం సరికాదని, శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆంజినేయులు, మున్సిపల్ చైర్మెన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్ లక్ష్మన్నలు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు అధికారం కోసం విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసిన వలంటీర్లను కించపరుస్తూ బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కిరీటి, కృష్ణారెడ్డి, చిత్తయ్య, హనుమంతరెడ్డి, మల్లికార్జున, చరణ్, చిరు, వంశీ, చిన్నా పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం హులికల్లుకు చెందినవారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలారి రంగయ్య సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీకి చెందిన వెంకటేశులు, ఆంజనేయులు, నాగరాజుతో పాటు దొణస్వామి, బసవరాజు, తిప్పేస్వామి, తిమ్మప్పలు పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, ఎంపీటీసీ హనుమంతరెడ్డి, మాజీ సర్పంచు బూదెప్ప, నాయకులు దొణస్వామి, మల్లికార్జున, చిత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎవరు ఏపార్టీ వారో తెలియకపోతే రాజకీయాలెందుకు?


మాట్లాడుతున్న హులికల్లు వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: అయ్యా అమిలినేనీ..ఎవరు ఏ పార్టీ వారో తెలియని నీకు రాజకీయాలెందుకు? అని హులికల్లు వైఎస్సార్‌సీపీ నాయకులు అమిలినేని సురేంద్రపై మండిపడ్డారు. సోమవారం మండలంలోని హులికల్లులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ హనుమంతరెడ్డి, మాజీ సర్పంచు బూదెప్ప, నాయకులు దొణస్వామి, చిత్తయ్య విలేకరులతో మాట్లాడాతూ ఆదివారం హులికల్లుకు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరినట్లు ఫొటోలకు ఫోజులిచ్చారన్నారు. వాస్తవానికి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నవీన్ చౌదరి, కొండయ్య చౌదరి, చిదానందప్పను కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా చూపించారన్నారు. ఎవరు ఏ పార్టీ వారో కూడా తెలియని నీవు కళ్యాణదుర్గం ఎలా అభివృద్ధి చేస్తావంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. టీడీపీ వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ వారు పార్టీలోకి చేరారు అనడం సిగ్గుచేటన్నారు.

మక్కా మసీదులో ఇఫ్తార్ విందు


మక్కా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: రంజాన్ మాసంలో దీక్షాపరులకు ఇఫ్తార్ ఇవ్వడం ఎంతో పుణ్యకార్యమని మక్కా మసీదు ఇమామ్ ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు. ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. కాలనీకి చెందిన ముస్లిం యువకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి మగ్‌రిబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


కంబదూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కంబదూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని డీఎస్పీ బి.శ్రీనివాసులు సూచించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన నూతిమడుగు, తిప్పేపల్లి, కర్తనపర్తి, రాళ్లపల్లి, ఐపార్సుపల్లి, గొల్లపల్లి, తిమ్మాపురం, కంబదూరు, కురాకులపల్లి, ఒంటారెడ్డిపల్లి గ్రామాల్లో డీఎస్పీ శ్రీనివాసుల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు ఆంజనేయులు,రాంభూపాల్, పరశురాం, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌కుమార్, బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు మనోజ్‌కుమార్, రాజన్ త్యాగి, కుల్దీప్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ మధుసూదన్‌రావు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్-2, బాలికల హాస్టళ్లు 1,2 హాస్టళ్లను సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో జేడీ మాట్లాడారు. ఒత్తిడికి గురికాకుండా పదోతరగతి విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, వార్డెన్లు నాగరాజు, సూరంజనేయులు, ఓబులమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై ఎలుగుబంటి దాడి

కంబదూరు: మండలంలోని గుద్దెళ్ల గ్రామానికి చెందిన బోయ పార్వతమ్మపై ఎలుగు బంటి దాడి చేసింది. సోమవారం తన పొలంలో పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో ఉన్నఫళంగా ఎలుగు బంటి దాడి చేయడంతో పార్వతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమెను కాపాడి చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం


పార్టీ శ్రేణులతో కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించిన మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల దీవెనలతో మరోమారు ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రముఖులు, ఆత్మీయులు, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను కలిసి ఆత్మీయ పలకరింపు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలూ అమలు చేసి సంక్షేమ పథకాలతో పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన గొప్ప పాలకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా టీడీపీ నాయకులు కూడా రూ.లక్షల్లో లబ్ధి పొందారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసేందుకు పేదలు, కార్మికులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మహిళలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు వలిబాషా, శ్రీనివాస యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివకుమార్, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కురుబ సంఘం అధ్యక్షుడు గురుమాలు రాజు, శీన, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, డిష్ గోవిందు, వన్నూరుస్వామి, ఫకృద్దీన్,, బండి అజయ్, ప్రతాప్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, గోనబావి నిజాముద్దీన్, వంశీ, రఫీక్, కొలిమి ఆనంద్, అబుబక్కర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భంభంబాబా షంషీర్ ఉత్సవం


పట్టణంలో షంషీర్‌ను ఊరేగిస్తున్న స్వామి శిష్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మహాయోగి భంషేక్ అబ్దుల్‌వహాబ్ స్వాముల (భంభంబాబా) 55వ ఉరుసు వేడుకల్లో భాగంగా సోమవారం షంషీర్ (బ్రహ్మోత్సవం) నిర్వహించారు. తెల్లవారుజామున గుర్రంపై స్వామి షంషీర్ ఉత్సవాన్ని పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆత్మకూరు వీధి, కోట, వినాయక సర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీ బజార్, కణేకల్లు రోడ్డు మీదుగా అనంతరం దర్గాకు చేరింది. తెల్లవారు జాము 4 గంటలకు ప్రారంభమైన షంషీర్ ఊరేగింపు ఉదయం 10 గంటలకు దర్గాకు చేరుకుంది. భంభంస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం జియారత్ కార్యక్రమం జరిగింది.

అమిలినేని హోలీ తాయిలాలు

కళ్యాణదుర్గం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఎస్టీ ఓట్లకోసం ఎన్నికల తాయిలాలు ప్రకటించారు. హోలీ పండుగ సందర్భంగా ఒక్కో గిరిజన తండాకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అందించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే తాను ఎన్నికల కోసం ఇవ్వలేదని, కేవలం హోలీ పండుగ సందర్భంగా నగదు ఇస్తున్నట్లు చెప్పడం గమనార్హం. ఇందులో భాగంగానే ఎన్నికల నిబంధనలు గాలికొదిలి సోమవారం శెట్టూరు మండలం మాకొడికి తండాలో హోలీ పండుగంటూ టీడీపీ కండువాలు, కాన్వాయ్‌తో వెళ్లి తండాలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ హోలీ పండుగ సందర్భంగా ఎలాంటి ప్రచారాలు చేయకూడదని, చేయాల్సి వస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలని స్పష్టంగా ఆదేశాలిచ్చినా టీడీపీ నేతలకు అవేవీ పట్టడం లేదని పలువురు చర్చించుకున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ


శెట్టూరు చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రాణీ సుస్మిత

శెట్టూరు: మండలంలోని బార్డర్ చెక్‌పోస్టులను ఆర్డీఓ రాణీసుస్మిత సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. మండలంలో శెట్టూరు, అయ్యగార్లపల్లి గ్రామాల్లోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆర్డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంటింటికీ మన విశ్వన్న

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఈనెల 26న మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటింటికీ మన విశ్వన్న కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సర్పంచు మోనాలిసా, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్ తదితరులు వివరాలు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటింటికీ మన విశ్వన్న కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వే శ్వరరెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ తదితరులు హాజరవుతారన్నారు.

27న ఇంటింటికీ విశ్వన్న

ఉరవకొండ: పట్టణంలోని 11, 12వ వార్డుల్లో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 27న ఇంటింటికీ విశ్వన్న కార్యక్రమం ఉంటుందని పార్టీ పట్టణ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 7.30 గంటలకు ఇంటింటా ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


కార్మికుడితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నింబగల్లులో ఇంటింటా ప్రచారం చేస్తున్న కురుబ సంఘం నాయకులు


దర్గాహొన్నూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ సోదరుడు రవీంద్ర కోరారు. సోమవారం మండలంలోని వేపులపర్తిలో కురుబల ఆరాధ్యదైవం బీరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం తాలూక అధ్యక్షుడు దొణస్వామి, గంగాధరప్ప , మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ బుసప్ప , మాల్లాపురం మల్లి , శరణప్ప, మహలింగ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించండి

ఉరవకొండ: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించి, ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కురుబ సంఘం నియోజకవర్గ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కొడిగి గోవిందు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నభీమా, ప్రకాష్, గాదిలింగ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని దర్గాహొన్నూరు, వన్నల్లి, హోసల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పథకాలు, చేసిన మేలును వివరించారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామంజనేయులు, నాయకులు ఈశ్వరరెడ్డి , ఎంసీహెచ్ రాజ్‌కుమార్, రామకృష్ణ, కందేపల్లి రమేష్, విశ్వనాథ్‌రెడ్డి, మాబుసాబ్, ఆంజనేయులు, వెంకటేశులు, ఫొటో బసవరాజు, సురేష్ స్వామి, లక్ష్మీనారాయణ, జయరామ్‌రెడ్డి, బుజ్జి, బసవరాజు, మారుతి, కృష్ణ, చిందానంద, వన్నూరుస్వామి, దేవేన్న, ఆంజనేయులు, నుంకేష్, సుధాకర్, బడిగే వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు కంబదూరులో ఎంపీ పర్యటన

కంబదూరు: మండల కేంద్రంలో ఎంపీ తలారి రంగయ్య మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక సాయిబాబా ఆలయం నుంచి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం

కుందుర్పి: మండల సరిహద్దునున్న వదనకల్లు శ్రీగురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరగనుంది. ఏటా పాల్గుణ మాసం చిత్త నక్షత్రం రోజున బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం అగ్నిహోమం మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, సాయంత్రం బ్రహ్మరథోత్సవం సందర్భంగా రథాన్ని గ్రామ పురవీధుల గుండా భక్తుల సహాయంతో ఊరేగిస్తారు. శుక్రవారం పూల రథోత్సవం భిక్షాటన తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఎర్రగుంటలో...

మండలంలోని ఎర్రగుంటలో మంగళ,బుధ వారాల్లో మారెమ్మ జాతర జరగనున్నట్లు సర్పంచ్ విశాలాక్షి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం గ్రామ శాంతి, బుధవారం గావు తీసే కార్యక్రమం ఉంటుందన్నారు.

గిరిజన కుటుంబాలకు సాయం

బ్రహ్మసముద్రం : హోలీ పండుగ సందర్భంగా గిరిజన కుటుంబాలకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు. బొమ్మగానిపల్లి వంకతండాకు చెందిన వృద్ధురాలు రాంకీబాయి, సాలబాయి రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకరనాయక్, ఉపాధ్యాయులు గోవింద్ నాయక్, రామాంజనేయులు, చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. మండల కేంద్రానికి చెందిన పయ్యావుల హనుమంతప్పకు చెందిన ద్విచక్రవాహనం హోండా షైన్ ఇంటి బయట నిలిపి ఉండగా, ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కుమ్మరి పాండు అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చొరబడి బీరువా ధ్వంసం చేశారు. బీరువాలో నగదు, విలువైన వస్తువులు లేకపోవడంతో వెళ్లిపోయారని బాధితుడు తెలిపాడు.

జోడు లింగాలకు విశేష పూజలు


అలంకరణలో జోడు లింగాలు

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శివపార్వతుల జోడులింగాల సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వాములు విశేష పూజలు చేశారు. భక్తులు జోడు లింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జూదరుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని విట్లంపల్లి బస్టాండ్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.3,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆమిద్యాలలో గడ్డివాములకు నిప్పు

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాలకు చెందిన రైతు గోపీ కి చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గడ్డివాముల సమీపంలో విద్యుత్ తీగల నుంచి రవ్వలు రాజుకుని నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు.

జగదీశ్వరి ఆలయంలో హోమాలు


అలంకరణలో జదీశ్వరి

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులో ప్రసిద్ధిగాంచిన శ్రీజగదీశ్వరి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు, లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామల ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి అభిషేకం, మహామంగళహారతి, కుంకమార్చన, దీక్షాహోమం నిర్వహించారు. అమ్మవారికి విశేష పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల అధ్వర్యంలో లోక కళ్యాణార్థము గణపతి, నవగ్రహ, లలితా త్రిపుర సుందరీదేవి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు


ఉరవకొండలో రంగునీళ్లు చల్లుకుంటున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలో హోలీ వేడుకలను సోమవారం యువత, పిల్లలు ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక ఇంద్రానగర్, రంగావీధి, డ్రైవర్స్ కాలనీల్లో పిల్లలు, యువత రంగు నీళ్లు చెల్లుకుంటూ ఉత్సాహంగా కనిపించారు.

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్ తండా (వెంకటాంపల్లిపెద్ద తండా)లో సోమవారం హోలీ వేడుకలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని యువకులు, గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని ఎస్ఎస్‌పీ తండాలోనూ హోలీ నిర్వహించారు.

ఫ్యాన్ స్పీడు..శ్రేణుల్లో జోష్

- ఊపందుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం
- వరుస సమీక్షలు, సమావేశాలతో నూతనోత్తేజం
- జగన్ సంక్షేమ పథకాలకు జై కొడుతున్న జనం

రాయదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ పారదర్శకంగా అందాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకూ సత్వర సేవలు అందుతున్నాయి. పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పల్లెల్లోనే రైతన్నలకు ఎక్కడికక్కడ ఎరువులు, మందులు, విత్తనాలు అందుతున్నాయి. ఏ ఇంటికెళ్లినా ప్రతి నోటా వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన మాటే.. ఫ్యాన్ గాలి స్పీడుగా తిరుగుతుంటే.. శ్రేణుల్లో జోష్ పెరిగింది. రాష్ట్రస్థాయి నేతల వరుస సమీక్షలు, సమావేశాలతో నూతనోత్తేజం వచ్చింది. త్వరలో జరగబోవు ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీ సాధించేందుకు శ్రేణులను సిద్ధం చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మెట్టు గోవిందరెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ ప్రచారం ఊపందుకుంది.

ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు..

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు చేపట్టిన ప్రచారానికి విశేష స్పందన వస్తోంది. సంక్షేమ పథకాలు వర్తించిన ప్రజలే స్టార్ కాంపెయినర్లుగా మారుతున్నారు. ఎన్నిక ప్రచారంలో ప్రజలే స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఐదేళ్ల పాలనలో పార్టీలు, కులమతాలు ఏవీ చూడకుండా సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ఇంటింటా వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. మరోవైపు బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలతో పార్టీ కోఆర్డినేటర్లు, ఇన్‌చార్జ్‌లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, చురుగ్గా పాల్గొనేలా కార్యాచరణ చేపట్టారు.

టీడీపీలో తెరకెక్కిన నాన్‌లోకల్ వార్..?

రాయదుర్గం తెలుగుదేశం పార్టీలో నాన్‌లోకల్ వార్ నడుస్తోంది. బలమైన సామాజిక వర్గం నుంచి స్థానికంగా టికెట్ ఆశించి భంగపడిన నేతలు అలకబూనారు. టికెట్ ఆశించిన స్థానిక ఓ పోలీస్ అధికారితోపాటు జిల్లాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి పేర్లు చివరి వరకు వినిపించాయి. తీరా పార్టీ అధినేత చంద్రబాబు వారి ఆశలు నీరు గారుస్తూ కాలవ శ్రీనివాసులు పేరు ప్రకటించారు. జెండాలు మోసేందుకు తప్పా.. పదవులు అనుభవించే అవకాశం పార్టీలో దక్కలేదని టికెట్ ఆశించి భంగపడిన వారితోపాటు సీనియర్లు ఈ ఎన్నికల్లో కాలవకు సహకరించేదిలేదని అంటున్నారు. దీంతో రాయదుర్గం టీడీపీలో మూడు గ్రూపులు, ఆరు తగాదాలు అన్నట్లు నడుస్తోంది. ఏది ఏమైనా 2024 ఎన్నికల్లో గెలవడం టీడీపీకి కష్టమేనని ప్రజలు చెప్పుకుంటున్నారు.

